నేడు నేత్ర వైద్య శిబిరం

నల్లకుంట: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నేత్ర ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్. భగవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లకుంట సంజయ్‌నగల్‌లోని డాక్టర్ అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో ఉదయం 10గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9, 10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 9, 10 తేదీల్లో హిమాయత్‌నగర్‌లో జరగనున్నాయి. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశాల విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విద్యార్థి నేతలు ఆవిష్కరించారు. పుట్ట లక్ష్మణ్, గ్యార నరేష్, లెనిన్, నెల్లి సత్య పాల్గొన్నారు.

వన్ టైం ఛాన్స్ పీజీ పరీక్షలుప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వన్ టైం పీజీ 2, 4 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి 1, 3 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఫీజు చెల్లించిన విద్యార్థులు ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి హాల్ టికెట్లను పొందవచ్చు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

హ్యాండ్ బాల్ విజేతగా హిందీ మహా విద్యాలయ జట్టు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల పోటీల్లో హ్యాండ్ బాల్ విజేతగా హిందీ మహావిద్యాలయ జట్టు నిలిచినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో సికింద్రాబాద్ పీజీ కాలేజీ జట్టుపై మహా విద్యాలయ జట్టు విజయం సాధించిందన్నారు. మూడో స్థానంలో భవన్స్ వివేకనంద కాలేజీ నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇఫ్లూకు పర్మనెంట్ వీసీని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)కు పర్మనెంట్ వీసీని నియమించాలని విద్యార్థులు కోరారు. మాజీ వీసీ ప్రొ.సురేష్ కుమార్ పదవీ కాలం ముగిసిన తర్వాత ఏడాదిగా ఇన్‌చార్జి వీసీలే ఇఫ్లూ పాలన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తొలుత ప్రొ.సురభి భారతి ఇన్‌చార్జి వీసీగా పని చేసి ఉద్యోగ విరమణ చేయగా ప్రస్తుతం ప్రొ.హరిబండి లక్ష్మీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. అయితే ఇన్‌చార్జి వీసీలకు పరిమిత అధికారాలు ఉన్నందున ఇఫ్లూ అభివృద్ధి కుంటుపడుతోందని విద్యార్థులు పేర్కొన్నారు. అధ్యాపకుల, ఉద్యోగుల పదోన్నతులు నిలిచిపోయాయని, యూజీసీ గ్రాంట్స్, ఇతర నిధులు, ప్రాజెక్టులు రావడం లేదని వారు పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులు పర్మనెంట్ వీసీ లేనందున ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పార్టీ పటిష్టతకు నా వంతు కృషి చేస్తా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ను బుధవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం తనపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిందన్నారు. పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. దానికి మీరందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.కిరణ్, భరత్‌భూషణ్, రఘువీర్, విశాల్‌సింగ్, గడ్డం సతీష్, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిక్కడపల్లి: బీజేపీ గాంధీనగర్ యువ నాయకుడు దోనేటి సత్యం ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ బుధవారం రాత్రి జవహర్‌నగర్‌లోని సత్యం నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, భరత్ భూషన్, గంగులోత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బాలికను లైంగికంగా వేధించిన యువకుడు

మూడేళ్ల జైలు శిక్ష విధించిన కోర్టు

కాచిగూడ: బాలికను లైంగికంగా వేధించిన ఓ యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని తిరుపతి జిల్లా వాకాడ మండలం బాలిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన రమణయ్య కుమారుడు ఎంబటి మహేష్ (30) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. 2022లో బర్కత్‌పుర ప్రాంతానికి చెదిన 14ఏళ్ల బాలికను లైంగికంగా వేధించాడు. వాట్సాప్ గ్రూపులలో అసభ్య పదజాలాలతో మేసేజ్‌లు పెట్టేవాడు. ఆ బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లి 12వ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి టి.అనిత బుధవారం దీనిపై పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చింది.

ఏడాదైనా రోడ్డు వేయరా?



బాగ్‌అంబర్‌పేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అధ్వానంగా రోడ్డు

- బాగ్‌అంబర్‌పేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదురు గల్లీలో రోడ్డు అధ్వానం
- ఇంటి ముందు నడవలేక అవస్థలు పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికార యంత్రాంగం

అంబర్‌పేట: ఏడాది కాలంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. పైపులైన్ కోసం తొవ్విన రోడ్డు వేయడానికి అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో వందలాది కుటుంబాలు నిత్యం నరకయాతనకు గురువుతున్నాయి. బాగ్ అంబర్‌పేట డివిజన్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న గల్లీలో తవ్విన రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం ఇక్కడి గల్లీలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించారు. అనంతరం తిరిగి రోడ్డు వేయడంలో ప్రభుత్వ యంత్రాంగం జాప్యం చేస్తోంది. నిత్యం వృద్ధులు, చిన్నారులు ఇంటి ముందు నడవలేక ప్రమాదాల బారిన పడుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎవరికి వారే...

జలమండలి అధికారులు పైపులైన్ వేసిన అనంతరం రోడ్డు పనుల కోసం జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జలమండలి అధికారలు కాలయాపన చేశారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడి రోడ్డును టెండర్ వేయడంలో జాప్యం చేయడంతో రోడ్డు బాధ్యత నిధుల ఖాతాలో చేరింది. ఎమ్మెల్యే నిధులతో చేపట్టాల్సిన రోడ్డు పనులకు ఆర్ ఐసీ విభాగం అంచనాలు రూపొందించి, టెండర్ల పిలువాలి. వారు జాప్యం చేసి ఎట్టకేలకు టెండర్లు పిలిచిన టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. దీంతో ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటు రోడ్డు మాత్రం వేయడంలేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోని రోడ్డు వేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

చొరవ తీసుకుంటా..

రోడ్డు నిర్మాణా జాప్యంపై విచారించి చర్యలు తీసుకుంటా రోడ్డు త్వరగా పూర్తియ్యేలా కృషి చేస్తాను. సంబంధిత అధికారులతో సమీక్షించి రోడ్డు నిర్మించేలా చొరవ తీసుకుంటాను.

– డీఎంసీ మారుతీదివాకర్



ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ అమలు చేయాలి



బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ మాదిగ

కాచిగూడ: ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్‌ను అమలు చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు, ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సూచించినటువంటి సంపన్న దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, గ్రూప్ వన్ ఆఫీసర్స్, మేయర్లు, జడ్పీ చైర్మన్లను ఎస్సీ రిజర్వేషన్ల నుంచి మినహాయించి క్రిమిలేయర్‌ను అమలు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రివర్గ కమిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని సంపన్న దళితుల నుంచి పేద దళితులకు ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈనెల 16వ తేదీన ఆమరణ నిరహార దీక్ష చేయనున్నట్లు క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాల మాదిగ ఉపకులాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి దయానంద రావు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఉపాధ్యక్షుడు పోరాటాల రామన్న, ధర్మాల సాయికుమార్, శ్రీధర్ మాల, కొండూరు రాజు మాదిగ, బాలస్వామి మాదిగ, బాలరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు చరిత్రాత్మకం



చెప్పల్‌బజార్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు చరిత్రాత్మకమని కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి మన్నె మహేష్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా చెప్పల్ బజార్‌లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత కులగణన చేపట్టి నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా 42శాతం బీసీ రిజర్వేషన్స్ పెంచుతూ బిల్లు ఆమోదించడం హర్షణీయమని అన్నారు. సమగ్ర కులగణన విజయవంతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సఫలీకృతం అయ్యిందన్నారు.

దండోరా ఉద్యమానికి సంఘీభావం తెలపాలి



మాదిగ మహిళా మేధావుల సన్నాహక సమావేశంలో గోగు శ్యామల తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేపట్టిన దండోరా ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని ప్రముఖ రచయిత గోగు శ్యామల పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా మేధావుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాదిగల సంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాలు ఆకట్టుకునేలా సాగాయి. అనంతరం గోగు శ్యామల మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలుకై మందకృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి తెలంగాణ ప్రజలు సంఘీభావం తెలపడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి జూపాక సుభద్ర, నాయకులు జేపీ లత, అందే గంగాజమున, అరుణ క్వీన్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, సజయ, భూమిక ఎడిటర్ కొండవీటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

కాచిగూడ: రైలులో ఓ ప్రయాణికురాలి వెండి వస్తువులు ఉన్న చేతి బ్యాగు చోరీ జరిగింది. కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన మనీష్ గుప్తా తన భార్యతో కలిసి జైపూర్ నుంచి కర్నూల్‌కు అజ్మీర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. రైలు ఉజ్జయిని స్టేషన్ వద్ద ఉండగా 170 గ్రాముల వెండి వస్తువుల బ్యాగు చోరీకి గురైంది. బుధవార మనీష్‌గుప్తా కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఉజ్జయిని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.


రైలుకింద పడి విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ: కుటుంబ కలహాలతో రైలు కిందపడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన బిటెక్ విద్యార్థి మణికంఠ (33) విద్యానగర్ – జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మంగళ రాము (68) మైసూర్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. యాకత్‌పుర – ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య బాత్‌రూమ్‌కు వెళ్లగా ప్రమాదవశాత్తు రైలులో నుంచి కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



రాజమణి (ఫైల్)

నల్లకుంట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు.. ప్రైవేటు ఉద్యోగి కె.శంకర్ తన కుటుంబసభ్యులతో కలిసి నల్లకుంట తిలక్‌నగర్‌లో నివాసముంటున్నారు. అతని తల్లి కె.రాజమణి(58) ఈనెల 4వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినప్పటికీ తల్లి ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన శంకర్ తమ తల్లి కనిపించడం లేదంటూ బుధవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన సమగ్ర వివరాలను ప్రజల ముందు ఉంచాలి

బహుజన లెఫ్ట్ పార్టీ అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనలో బీసీ కులాల జనాభా లెక్కలను కులాల వారీగా సమగ్ర విచారణతో కూడిన సమాచారాన్ని రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన లెక్కలపై బీసీ కులాల సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర వివరాలతో కూడిన సమాచారాన్ని ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుల గణన సర్వేపై చర్చించకుంటే బీఆర్ఎస్, బీజేపీ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ గెజిట్ విడుదల చేసే ముందు మాదిగ, మాల, వాటి ఉపకులాల మేధావులతో ప్రభుత్వం చర్చించాలని కోరారు. మూడు దశాబ్దాల వర్గీకరణ పోరాటానికి ఇకనైనా సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు.

కలిసికట్టుగా హెబ్రోను చర్చి ప్రతిష్టను కాపాడాలి

ఎమ్మెల్యే ముఠాగోపాల్



చర్చిలో సొసైటీ, ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చి ప్రతిష్టను కాపాడేందుకు అంతా కలసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. ఇటీవల నిర్వహణ విషయమై కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆయన చర్చిని సందర్శించి సొసైటీ, ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడారు. ఏదైనా సమస్యలుంటే న్యాయబద్ధంగా పరిష్కరించుకోవాలని అన్నారు. చర్చి ప్రతిష్టకు భంగం కలగించొద్దని అన్నారు. బేధాభిప్రాయాలు లేకుండా చర్చ నిర్వహణను చేపట్టాలని కోరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దైవజనులు బ్రదర్ భక్తసింగ్ క్రైస్తవ సమాజానికి ఆదర్శంగా నిలిచారని ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, క్రిస్టియన్ చైర్మన్ జేఏసీ సాల్మన్‌రాజు, కృపాదానం, సొసైటీ సభ్యులు బ్రదర్ కురియన్, వీరాచారి, ట్రస్ట్ సంబంధించిన సభ్యులు ఎఫ్‌సీఎస్ పీటర్, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

హోలియదాసరులను ఎస్సీ 'సీ' లో చేర్చడం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

పంజగుట్ట: ఎస్సీల్లో అత్యంత వెనకబడిన హోలియ దాసరి కులాన్ని ఎస్సీ 'సి' జాబితాలో చేర్చడం దారుణమని, తాము ఏ విధంగా అభివృద్ధి చెందినట్లు గుర్తించారో ముఖ్యమంత్రి వివరించాలని హోలియ దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తంటం జహంగీర్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్,కోశాధికారి ఆర్.శంకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తమ కుల జనాభా సుమారు లక్షకు పైగా ఉన్నా కేవలం 8482 మంది ఉన్నట్లు చూపించడం దారుణమన్నారు. హోలియ దాసరి కులం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఎంపీటీసీ, ముగ్గురు సర్పంచ్‌లు మాత్రమే ఉన్నారని, ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ లేరని విద్యలో కూడా తాము ఎంతో వెనకబడి ఉన్నామని అలాంటి తమ కులాన్ని ఎస్సీ సీ జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఎస్సీల్లో మాల, మాదిగను మినహాయించి మిగిలిన 57 కులాలను ఒక్కచోట చేర్చి తమకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి అత్యంత వెకబడిన తమ కులాన్ని ఎస్సీ ఏ లో చేర్చాలని, లేదా మాల, మాదిగలను మినహాయించి 57 కులాలను ఒక్కచోట చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీరేష్, రాజు, నర్సింహ, చిరంజీవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు చర్యలు చేపట్టాలి



అశోక్‌నగర్ పార్కు1, 2లను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని పార్కుల సుందరీకరణ అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ పావని ఉద్యానవన అధికారులను కోరారు. బుధవారం సాయంత్రం డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీ సురభి పార్కు, అశోక్‌నగర్ పార్కు1, 2లను హార్టికల్చర్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్కులో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి సుందరీకరించాలని అన్నారు. ఉద్యానవనాల్లో దీపాలు సరిగా వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలని అన్నారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా పార్కుల సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు అశోక్‌కుమార్, అబ్దుల్ సలామ్, నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయి చంద్, సత్తిరెడ్డి, నరిసంగ్‌రావు, సాయికుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వట్టికోట ఆళ్వారుస్వామికి నివాళి



నగర కేంద్ర గ్రంథాలయంలో ఆళ్వారుస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి: సాంస్కృతిక పునరుజ్జీవానికి పునాదులు వేసిన వైతాళికుడు వట్టికోట ఆళ్వారు స్వామి అని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వట్టికోట ఆళ్వారుస్వామి చిత్రపటానికి ఆయన గ్రంథాలయ కార్యదర్శి పద్మజతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎల్ ఇన్‌చార్జి సుబ్బలక్ష్మి, గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది కవిత, మహేశ్వరి, ఉమ, యాదమ్మ, బి.అవినాష్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, పాఠకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నామస్మరణ వారోత్సవాలు



భజనలో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేస్తున్న అర్చకస్వామి

నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈనెల 2న ప్రారంభమైన నామస్మరణ వారోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. బుధవారం ఉదయం అర్చక స్వామి రాఘవ శర్మ మంత్రోచ్చరణల నడుమ రాధాకృష్ణులు, కుసుమహరులకు అర్చనలు నిర్వహించారు. అంతకుముందు మౌన నామజపం జరిగింది. ఈ సందర్భంగా భక్తులచే సుప్రభాత సంకీర్తనల భజన ఎంతగానో ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కావించారు.

9న కుసుమ హరుల దివ్య లీలా కల్యాణం..

నామస్మరణ వారోత్సవాలు ముగిసిన మరుసటి రోజున ఆదివారం (ఈనెల 9వ తేదీన) ఉదయం 10గంటలకు కుసుమ హరుల దివ్య లీలా కల్యాణోత్సవం ఉంటుందని ఆశ్రమ పాల మండలి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం (కల్యాణ విందు) ఉంటుందని అన్నారు.

భౌ భౌ.!

- అజార్ వీధిలో కుక్కల బెడద
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ సమీపంలోని అజార్ వీధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చీకటి పడిందంటే గుంపులు గుంపులుగా సంచరిస్తూ అటుగా వచ్చే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. స్థానికంగా ఉన్న సెయింట్ పాయిస్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల వెంట కుక్కలు వెంబడిస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రమేష్ అనే స్థానికుడు కిరణా దుకాణానికి వెళ్తుండగా కుక్కలు అతని వెంటపడటంతో కిందపడి పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే ఇప్పటి వరకు ముగ్గురిపై కుక్కలు దాడి చేశాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు వీధి కుక్కలను పట్టుకుని తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వెంటపడటంతో గాయపడ్డాను



మా వీధిలో 5 నుంచి 8 కుక్కలు ఉన్నాయి. తరచూ ఎవరో ఒకరి మీద కరవడానికి మీదికొస్తున్నాయి. నన్ను కరవడానికి వచ్చినప్పుడు పరిగెత్తడంతో కిందపడిపోయాను. తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి కుక్కలను తరిమడంతో ప్రమాదం తప్పింది. ప్రతి రోజు కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రమేష్, స్థానికుడు